క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతపై ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ర్యాలీ



సీతారాంపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పెసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సీతారాంపురం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో మూడో రోజున ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. వీధులను శుభ్రపరిచారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వివిధ వ్యాధులు, వాటి వ్యాప్తి, లక్షణాల పట్ల ప్రజలలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.వెంకటకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జి.టి.నాయుడు, భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రపంచ పుస్తక దినోత్సవం



అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి చేరుకుని వివిధ కేటగిరీలకు చెందిన పుస్తకాలు ఆసక్తిగా పరిశీలించారు. తమ అభిరుచి మేరకు పుస్తకాలను తీసుకుని గంటల తరబడి చదవడంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పుస్తకాల పఠనంతోకలిగే ప్రయోజనాలను వివరించారు.

200 మందికి వైద్య పరీక్షలు



కొండకర్ల సచివాలయంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని కొండకర్లలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ని శివ, అనిల్ నీరుకొండ ఆస్పత్రి(తగరపువలస) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సుగర్, బీపీ, కంటి వ్యాధులు, కీళ్ల నొప్పులు తదితర రోగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చప్ప సన్యాసినాయుడు, ధూళి నాగరాజు, గొంతిన భాస్కరరావు, కట్టమూరి పాపారావు, బిల్లా ప్రకాష్, దాసరి అప్పలరాజు, పల్లా ప్రకాష్, పచ్చికూర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మునగపాకలో చలివేంద్రం ప్రారంభిస్తున్న విశ్రాంత సీఈవో వెంకటరావు

మునగపాక : వేసవి దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని విశ్రాంత సీఈవో పెంటకోట వెంకటరావు అన్నారు. మునగపాక పీఏసీఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున రాకపోకలు సాగించేవారికి ఇటువంటి చలివేంద్రాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఆడారి లక్ష్మణరావు, ఆడారి కాశిబాబు, పెంటకోట శ్రీనివాసరావు కిష్టప్ప పాల్గొన్నారు.

ఎస్‌డీజీ సర్వేపై సమీక్ష నేడు

కోటవురట్ల : సస్టైన్ డెవలప్‌మెంట్ గోల్స్ సర్వేపై సోమవారం సమీక్ష నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సర్వే వివరాలతో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎస్‌కేలు, కార్యదర్శులు విధిగా హాజరు కావాలని సూచించారు.

జగనన్న మెగా కాలనీకి పక్కా రోడ్లు

- జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు
- ఇళ్ల నిర్మాణ పనుల్లో లబ్ధిదారులు



చురుగ్గా సాగుతున్న మెగా రోడ్డు నిర్మాణ పనులు



మెగా లేఅవుట్లో నిర్మాణంలో ఇళ్లు

పాయకరావుపేట : జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల ఏర్పాటు చురుగ్గా జరుగుతోంది. రోడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయం తదితర పనులు జోరందుకున్నాయి. అన్ని లే అవుట్లకు గ్రావెల్ రోడ్లు పక్కాగా ఏర్పాటు చేశారు. దీంతో ఇవన్నీ అందమైన కాలనీలుగా రూపుదిద్దుకుంటున్నాయి. పీఎల్ పురంలోని మెగా జగనన్న కాలనీ అన్ని రకాల వసతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది.

24 గ్రామాల్లో 19 చోట్ల లేఅవుట్లు

మండలంలోని 24 గ్రామాల పరిధిలో 19 చోట్ల జగనన్న కాలనీలకు స్థలాలు కేటాయించి లేఅవుట్‌లు వేశారు. ఇందుకు ప్రభుత్వం సమారు 100 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. వీటిలోనే మండలంలోని ఇళ్లు లేని నిరుపేదలు 2,807 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. వీరి పేరిట పట్టాల పంపిణీ కూడా ఎప్పుడో ముగిసింది. తమకు కేటాయించిన స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక లబ్ధి ఎప్పటికప్పుడు ఖాతాల్లో పడుతుండటం, నిర్మాణ సామగ్రి కూడా ప్రభుత్వమే తక్కువ ధరకు సరఫరా చేయడంతో లబ్ధిదారులు ఆనందంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుంటున్నారు.

పీఎల్ పురంలో మెగా జగనన్న కాలనీ

పాయకరావుపేట పట్టణంలో ఇళ్ల స్థలాలు లేని పేదలకు మండలంలోని పీఎల్ పురం గ్రామ పరిధిలో 42 ఎకరాల భూమిని సేకరించి మెగా లేఅవుట్‌గా ఏర్పాటు చేశారు. ఇందులోనే పాయకరావుపేట పట్టణానికి చెందిన ఇళ్లు లేని నిరుపేదలు 1,150 మందికి పట్టాలిచ్చారు. ప్రస్తుతం లబ్ధిదారులు ఇక్కడ ఇళ్ళ నిర్మాణాలు చురుగ్గా చేపడుతున్నారు. దీన్ని ఆనుకుని మరో 4 ఎకరాల భూమిని కూడా కాలనీకి సేకరించి మరో 300 మందికి స్థలాలిచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. మెగా జగనన్న కాలనీగా రూపుదిద్దుకుంటోంది.

రూ.30 లక్షలతో గ్రావెల్ రోడ్డు



జగనన్న కాలనీకి ఏర్పాటు చేస్తున్న 60 అడుగుల గ్రావెల్ రోడ్డు

ఈ కాలనీలో రోడ్ల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ పనులు పూర్తయ్యాయి. జాతీయ రహదారికి సమీపాన గల ఈ కాలనీకి గ్రావెల్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. 650 మీటర్ల పొడవున 60 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకు జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ నిధులు రూ.30 లక్షలు కేటాయించారు. ఈ రోడ్డు నిర్మాణంతో మెగా జగనన్న కాలనీ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

446 మందికి కంటి పరీక్షలు



బ్రాండెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరం



బ్రాండెక్స్‌లో కంటి వైద్య శిబిరంలో రోగుల్ని పరీక్షిస్తున్న వైద్యులు

- 18 మంది రక్తదానం

అచ్యుతాపురం(అనకాపల్లి) : బ్రాండెక్స్ ఇండియా అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన 105వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 446 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 295 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందించారు. 112 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 42 మందిని కేటరాక్ట్ సర్జరీలు చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి విచ్చేసిన వారికి మధ్యాహ్న భోజనం, ఫలహారం, మజ్జిగ అందించారు. బ్రాండెక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తదితరులు పాల్గొన్నారు. అదే సమయంలో బ్రాండెక్స్ ఆవరణలో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరంలో 18 మంది రక్తదానం చేశారు.

చురుగ్గా శ్మశానవాటిక అభివృద్ధి



తిమ్మరాజుపేట శ్మశానవాటికలో అభివృద్ధి పనులు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట శ్మశానవాటిక అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. శ్మశానవాటిక అభివృద్ధికి సంబంధించి మునగపాక మండల జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తన కోటా నుంచి రూ.5 లక్షలు, స్థానిక ఎంపీటీసీ శరగడం అప్పలనరసమ్మ తన కోటా నుంచి రూ.2.50 లక్షలు వెరసి రూ.7.50 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో శ్మశానవాటిక ప్రహరీతో పాటు పేరుకుపోయిన తుప్పలు, చెత్తను తొలగించే పనులు అధికారుల పర్యవేక్షణలో శరవేగంగా జరుగుతున్నాయి.

పుస్తకం మంచి నేస్తం



గ్రంథాలయంలో విద్యార్థుల పుస్తక పఠనం

నక్కపల్లి : పుస్తకం మంచి నేస్తమని, పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని చినదొడ్డిగల్లు గ్రంథాలయాధికారి కె.జనార్దన్ అన్నారు. ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. చిన్నప్పటినుంచే పిల్లల్లో పుస్తకపఠనం అలవాటు చేయాలన్నారు. తలదించుకుని పుస్తకం చదివితే తలెత్తుకునేలా చేస్తుందన్నారు. గ్రంథాలయాల్లో వేసవికాలంలో విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శిబిరాలకు హాజరయ్యే విద్యార్థుల కోసం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్‌పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు, వయో భేదం లేకుండా తీరిక సమయాల్లో అన్ని వర్గాల వారూ పుస్తకాలను చదవాలన్నారు.

ముఠా కార్మికులకు న్యాయం చేస్తాం



ఎమ్మెల్యే కన్నబాబురాజును కలిసిన ముఠా కార్మికులు

రాంబిల్లి : రసూల్ డెకర్ పరిశ్రమ వద్ద ధర్నా చేస్తున్న ముఠా కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు) హామీ ఇచ్చారు. ఆదివారం ముఠా కార్మికులు ఎమ్మెల్యేను కలిసి పాత పద్ధతిలో కూలీ రేట్లు చెల్లించేలా యాజమాన్యంతో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లాలం శ్రీనువాసరావు, అడిగర్ల దేముడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. రాము పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యాదవ సంఘం సభ్యులు

యలమంచిలి : పట్టణం మెయిన్ రోడ్డులోని ద్వారకానగర్ శ్రీకృష్ణ ఆలయం వద్ద, కృష్ణ యాదవ సంఘం సభ్యుల ఆర్థిక సహాయంతో చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు రేఖా శ్రీనివాస్, ధూళి దేవుళ్ళు, వియ్యపు గోపి, గొలగాని సన్నిబాబు, శీరా అచ్చిబాబు, కోన శంకరరావు, కె.శ్రీను, వి.శ్రీను, వి.సత్తిబాబు పాల్గొన్నారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తజనం

భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీలో స్వచ్ఛంద సంస్థలు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



క్యూలైన్లలో దర్శనానికి వెళ్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అనకాపల్లి జిల్లాతో పాటు పొరుగు జిల్లాలైన విజయనగరం, విశాఖ, పాడేరు, శ్రీకాకుళం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి హాజరుకావడంతో ఆలయంలో క్యూలైన్లు కిటకిటలాడాయి. పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు ఎక్కువగా హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువ పందిళ్లలో వంటలు చేసి అమ్మవారికి నివేదించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొంది, ఆనందంగా తిరుగుముఖంపట్టారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అధికారులు భక్తులకు మజ్జిగ, మంచి నీరు అందించారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అవసరమైన సాయం చేశాయి. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పట్టణ సీఐ దాడి మోహన్‌రావు, ట్రాఫిక్ సీఐ టి.శ్రీనుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా మానస నాగమ్మ ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధన ప్రారంభిస్తున్న మందపాటి జానకిరామరాజు

అనకాపల్లిటౌన్ : స్థానిక బర్మా కాలనీలో శ్రీ మానస నాగమ్మ ఆలయ వార్షికోత్స వం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తెల్లవారు జాము నుంచి నాగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు నాగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని జానకీరామరాజు ప్రారంభించారు. సుమారుగా 1000 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు కదిలిరండి..

కోటవురట్ల : మండలంలో వచ్చే నెల 14న నిర్వహించనున్న శ్రీ హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ ధర్మ ప్రచారక్ నక్కా సత్యనారాయణ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భారీ స్థాయిలో శ్రీ హనుమాన్ శోభాయాత్రను చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఇందు కోసం హిందూ బంధువుల సలహాలు, సహాయం తీసుకునేందుకు స్థానిక సినిమాహాలు రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో హనుమాన్ భక్తులు, మండల ప్రజలు, హిందూ ధర్మ ప్రచారకులు తరలివచ్చి తగు సూచనలు అందించాలని కోరారు.

గడప గడపలో నమ్మకం జగన్



దోసలపాడులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నాయకులు



మునగపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న సచివాలయ కన్వీనర్ మహేష్



దార్లపూడిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నాయికులు

నక్కపల్లి : ప్రతి ఇంట్లోనూ జగనన్న ప్రభుత్వం వల్ల లబ్ధిపొందినవారు, జగనన్నే తమ భవిష్యత్తు అంటూ అభిమానాన్ని చాటుకుంటున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలు గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, జగన్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని అభ్యర్థించారు.

- నెల్లిపూడిలో సర్పంచ్ కొలుకులూరి సురేష్ వర్మ, ఎంపీటీసీ తంగెళ్ల కృష్ణ, వేంపాడులో సచివాలయ కన్వీనరు అయినంపూడి సురేష్ రాజు, దోసలపాడులో ఎంపీటీసీ పక్కుర్తి రమణ, సచివాలయ కన్వీనరు గండేపల్లి ప్రకాష్, బుచ్చిరాజుపేటలో సచివాలయ కన్వీనర్లు గొర్ల బాబూరావు, యలమంచిలి మధు, గొడిచర్లలో నిట్లగోవిందు, నల్లల రామకృష్ణ, అల్లు రమణ, రాజయ్యపేటలో ఎరిపల్లి నాగేశు, పిక్కి నూకరాజు తదితరులు ఇంటింటికి తిరిగి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు అందుతున్న పథకాల వివరాలను తెలుసుకుని ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారు. ఇళ్లకు వారి అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు.

ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల సగటున ఏడాదికి లక్షరూపాయలు పైబడే లబ్ధి కలిగిందన్నారు. ఇటువంటి సంక్షేమ పాలన గతంలో ఎన్నడూ చూడలేదని, ఈ స్థాయి లబ్ధి ఎప్పుడూ పొందలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తమ మద్దతు అని, జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుంటామని హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు ప్రకటించిన హామీలన్నింటిని నెరవేరుస్తున్నారని, చంద్రబాబులా మోసం చేయలేదన్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు వలంటీర్ల ద్వారా ఇంటికి వద్దకే అందిస్తున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

మునగపాక : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని మునగపాక సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్ అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మునగపాక సచివాలయ పరిధిలో వలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. గత ప్రభుత్వానికి, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మధ్య తేడాను గుర్తించి, రానున్న ఎన్నికల్లో సీఎంగా జగన్‌కు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్లు అతికించారు.

ఎస్.రాయవరం : మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కిలింకోట నీలేంద్రరావు ఆధ్వర్యంలో దార్లపూడి గ్రామంలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పలు గృహాలను సందర్శించి ప్రభుత్వ పాలనపై ప్రజా మద్దతు పుస్తకంలో ఉన్న ప్రశ్నలను అడిగి, వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. పేద ప్రజల సమస్యలను గుర్తించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని ప్రతి ఒక్కరి నుంచి సమాధానం రావడంతో పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని అభ్యర్థించారు. జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భరోసా ఇచ్చారు. మోసపూరిత హామీలిచ్చే చంద్రబాబును నమ్మి మోసపోవద్దని ప్రజల్ని హెచ్చరించారు.

- కొత్తరేవుపోలవరం గ్రామంలో సర్పంచ్ మల్లే లోవరాజు, వమ్మవరంలో మాజీ సర్పంచ్ చిందాడ మంగ, ఎంపీటీసీ బాలం సూరిబాబు, పెద గుమ్ములూరులో వెలగా శ్రీనివాసరావు తదితరులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం మధ్య పాలనలో వ్యత్యాసాన్ని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, కోరెడ్డి బాబి, పోలిశెట్టి సతీష్, లంక బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా కె.వెంకటాపురం గ్రామంలో పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని ఆధ్వర్యంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ పాలన, సంక్షేమ పథకాల అమలు, చేకూరుతున్న లబ్ధిపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం వారి ఆమోదంతో గోడలపై స్టిక్కర్లు అతికించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కె.వెంకటాపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నాయకులు

'కేంద్రం తీరు మార్చుకోవాలి'



నేవీ పునరావాసకాలనీలో కేంద్ర ప్రభుత్వ విధానాలపై మాట్లాడుతున్న దేముడునాయుడు

రాంబిల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం మండల కార్యదర్శి జి. దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నేవీ పునరావాసకాలనీ, యాతకొత్తపట్నం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ, ప్రచారభేరి నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సీహెచ్ శివాజీ, నూకన్న తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్లో 'గడప గడపకు' నేడు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ 15వ వార్డు నెహ్రూనగర్ సచివాలయ పరిధి, పాత ఎస్‌బీఐ నుంచి సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్ పర్సన్ సుకుమారవర్మలు పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి పట్టణంలోని కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ ఉద్యోగులు, అధికార్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వార్డు సభ్యులు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఘనంగా పరశురామ జయంతి

తుమ్మపాల : పరశురాముని జయంతి సందర్భంగా పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద పరశురామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహిళా కార్యవర్గ సభ్యులను పసుపు కుంకుమలతో గౌరవించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పేరూరి బోగ లింగేశ్వరశర్మ, మండల అధ్యక్షుడు నాగలింగశాస్త్రి పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు



కె.వెంకటాపురంలో వీధి లైట్లు బిగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కోటవురట్ల : కె.వెంకటాపురంలోని పలు వీధుల్లో ఆదివారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ ఏ వీధిలో అయినా వీధి దీపాలు వెలగకపోతే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఆరుబయట నిద్రించేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.